# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటులో ఈ రోజు ప్రత్యేక చర్చ జరగనుంది.**
2. **ఆంధ్రప్రదేశ్ గొప్ప వారసత్వం, సంస్కృతికి గుర్తింపు పొందిందని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**
3. **హైదరాబాద్ లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈరోజు ప్రారంభిస్తారు.**
4. **ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో త్వరలో సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు**
5. **నిత్యజీవితంలో సమస్యలకు భగవద్గీత మార్గదర్శనం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ తెలిపారు.**

========================

భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలకు స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంటులో ఈ రోజు ప్రత్యేక చర్చ జరగనున్నది. ఈ గేయం చారిత్రక, సాంస్కృతిక ప్రాశస్త్యాన్ని తెలియజేయడమే ఈ చర్చ ప్రధానోద్దేశం. లోక్ సభలో ఈ చర్చను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. వందేమాతర గేయం పై చర్చ జరపాలని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన అఖిల పక్ష సమావేశం నిర్ణయించింది.

--------------------------

సంగీతం సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని ఆంధ్రప్రదేవ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తెలిపారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన “కృష్ణవేణి సంగీత నీరాజనం” ముగింపు కార్యక్రమంలో గవర్నర్ నిన్న ముఖ్య అతిధిగా హాజరయ్యారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గొప్ప వారసత్వం, సంస్కృతికి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని తెలిపారు. ఇక్కడ పుట్టిన కూచిపూడి నృత్యం ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిందని గవర్నర్ పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

హైదరాబాద్ లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఈరోజు ప్రారంభమవుతుంది. ఈరోజు, రేపు రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో వివిధ అంశాలపై 27 ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈరోజు మధ్యాహ్నం ఒంటి గంటకు సదస్సును తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లాంఛనంగా ప్రారంభిస్తారు. దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొననున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని  ఏర్పాట్లు చేసింది. రేపు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో త్వరలో సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  పేర్కొన్నారు. నగర సుందరీకరణ, ప్రజల జీవన ప్రమాణాల్ని మరింత మెరుగుపరిచేందుకు కట్టుబడి ఉన్నామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. “విశాఖలో ఏర్పాటుచేసిన ఫుట్‌పాత్‌లు, హరిత వాతావరణం స్థానికులతో పాటు సందర్శకులకు మరింత మెరుగైన అనుభవాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు.

---------------------------

క్యాన్సర్ ను సకాలంలో గుర్తిస్తే మెరుగైన చికిత్సతో అరికట్టవచ్చని  కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో 2 కోట్ల రూపాయల నిధులతో నిర్మించనున్న డయాలసిస్ కేంద్రానికి ఆయన నిన్న భూమి పూజ చేసారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, కిడ్నీవ్యాధిగ్రస్తుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని  నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యాధునిక డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే  4 కోట్ల రూపాయలతో అత్యాధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ సంచార వాహనాన్ని  అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాస వర్మ తెలిపారు.

---------------------------

ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని ఈశాన్య సరిహద్దు రైల్వే – ఎన్ఎఫ్ఆర్ వెల్లడించింది. అధిక డిమాండ్ ఉన్న మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని, ప్రత్యేక రైళ్లు సాధ్యంకాని మార్గాల్లో ప్రస్తుతం ఉన్న రైళ్లకు అదనపు కోచ్‌లను చేర్చామని, ఇందులో భాగంగా ఈ రోజు పలు మార్గాల్లో  ప్రత్యేక రైళ్ల సేవలను అందిస్తున్నట్టు ఎన్ఎఫ్ఆర్ సీపీఆర్ఓ కపింజల్ కిషోర్ శర్మ తెలిపారు. ఈరోజు రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నామని, ఒక రైలు డిబ్రూగఢ్ నుంచి న్యూఢిల్లీ వరకూ, మరో రైలు గౌహతి నుంచి హౌరా వరకూ వెళ్తుందని చెప్పారు

---------------------------

కర్ణాటకలోని ఉడిపిలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ నిన్న పర్యటించారు. పర్యాయ పుట్టిగే శ్రీకృష్ణ మఠం ఆధ్వర్యంలో  ఏర్పాటు చేసిన ‘బృహత్ గీతోత్సవ’ కార్యక్రమానికి  ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవద్గీత  మనో ధైర్యమిచ్చే గురువు, నిర్దేశించే దిక్సూచి అని తెలిపారు. నిత్యజీవితంలో సమస్యలకు గీత మార్గదర్శనం చేస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొంటూ,

వాయిస్ 31 సెకన్లు

---------------------------

రెండవ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – ఎస్.ఐ.ఆర్. ప్రారంభమైనప్పటి నుంచి నిన్నటి వరకు 50 కోట్ల 94 లక్షల మందికి పైగా గణన ఫారమ్‌లను పంపిణీ చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దశలో దాదాపు 51 కోట్ల మంది ఓటర్లలో 99.94 శాతం మంది జాబితాలను సవరిస్తామని పేర్కొంది. ఇప్పటివరకు 50 కోట్లకు పైగా ఫారమ్‌లను డిజిటలీకరణ చేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తొమ్మిది రాష్ట్రాలు మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల జాబితాల సవరణ రెండవ దశ ఎస్.ఐ.ఆర్ గత నవంబర్ 4న ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో ఓటర్ల జాబితా సవరణ పూర్తవుతుంది.

---------------------------

తెలంగాణలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆధునిక వంటశాలలను ఏర్పాటు చేస్తామని ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షేక్‌పేట లోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటుచేసిన మోడ్రన్ కిచెన్‌లో భాగంగా ఆధునిక రోటీ తయారీ, భోజనాలు సిద్ధం చేసే యంత్రాలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ గురుకులాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సాంఘిక సంక్షేమ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యాలయాల్లో ఎనిమిదో తరగతి నుంచి ఉన్నత ప్రమాణాలతో విద్యార్థులకు ఐఐటీ, నీట్ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల పెండింగ్ బిల్లులు, వేతనాలు, మౌలిక వసతుల బిల్లులు చెల్లిస్తామని మంత్రి తెలిపారు. .

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్నమూడు రోజుల పాటు పొడి వాతావరణం కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారి ఎల్ నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ 10 సెకన్లు

ఇక ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా కిలగాడలో 7.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదవ్వగా, తెలంగాణలోని ఆదిలాబాద్‌లో 9.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది,.

======================